క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ



కామారెడ్డి అర్బన్ : తొలిమెట్టు కింద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు చదవడం, రాయడంలో పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. తొలిమెట్టుపై శనివారం కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సామాజిక అభివృద్ధి లక్ష్యంగా శిక్షణ ఇచ్చినట్లు ప్రోగ్రాం అధికారి జి చంద్రశేఖర్‌గౌడ్, టి వెంకటేశ్వర్లు, శారద అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద: బిచ్కుందలోని ఆధార్ కేంద్రం నిర్వాహకుడు ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పతుండడంతో రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. సాక్షి పత్రికలో శుక్రవారం ఆధార్ కేంద్రంలో అక్రమ వసూళ్లు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్ఐ సాయిబాబా కేంద్రానికి వెళ్లి విచారణ జరిపారు. నిర్వాహకుడు ఒకొక్కరి నుంచి అదనంగా రూ.50 నుంచి రూ.వంద వరకు తీసుకుంటున్నట్లు విచారణలో తేలిందన్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటున్నట్లు నిర్వాహకుడు ఒప్పుకొని రాతపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందన్నారు. పై అధికారులకు నివేదిక పంపి, చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి


రాంకిష్టయ్య(ఫైల్)

నిజాంసాగర్ : మండలంలోని మాగి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత చీకోటి రాంకిష్టయ్య శనివారం ఆనారోగ్యంతో మృతి చెందారు. మాగి గ్రామ సర్పంచ్‌గా, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆయన పని చేశారు.

కోడెలకు గడ్డి అందజేత

భిక్కనూరు : భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయంలోని కోడె దూడలకు మండల కేంద్రానికి చెందిన రైతులు గొల్ల సిద్ధరాములు, గొల్ల అశోక్ ట్రాక్టరు గడ్డిని శనివారం అందజేశారు. ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పంట చేలలోని గడ్డిని ఆలయంలో కోడే దూడలకు ఇవ్వాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



తాడ్వాయి : మండల కేంద్రానికి చెందిన బండారి శివస్వామి యూనివర్సిటీ స్థాయిలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. శివస్వామి ఈనెల 3న డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, వీడీసీ చైర్మన్ రాజు తదితరులు శివస్వామిని అభినందించారు.

కామారెడ్డి అర్బన్: విశ్వ విద్యాలయాల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి పి భాస్కర్‌ను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు శనివారం అభినందించారు. కళాశాల ఇన్‌చార్జి పీడీ జి శ్రీనివాస్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి విద్యార్థులు..



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సౌత్ ఇండియా యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల సిబ్బంది శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సాయిబాబా, అరవింద్, రవీందర్, మహేందర్ తదితరులను ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

ఎల్లారెడ్డిని అభివృద్ధి పథంలో నడిపిస్తా

టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో ఆయన టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎమ్మెల్యే సురేందర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో తపన పడుతారని చెప్పారు. మరోమారు సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన అజ్మీరా సంగ్యా ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆయన ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి శనివారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

జాజాలకు డిపాజిట్ దక్కనివ్వను

కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు


ఎల్లారెడ్డిలో మదన్‌మోహన్‌రావు, రవీందర్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు


మర్కల్‌లో అభివాదం చేస్తున్న మదన్‌మోహన్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు

సదాశివనగర్ : జాజాల సురేందర్ రాజకీయ జీవితం భూస్థాపితం చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మదన్ మోహన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సోనియా గాంధీని, కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను మోసం చేసిన సురేందర్‌కు డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తానన్నారు. కాలికి బలపం కట్టుకుని జాజాల సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేసీఆర్‌కు అమ్ముడు పోయారన్నారు. డిసెంబర్ 3 జాజాల సురేందర్‌ను రాజకీయ సమాధి చేయాలని కోరారు. కార్యకర్తలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పాలా కాపాడుకుంటానన్నారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వం ఇచ్చే జీతాన్ని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చేస్తానన్నారు. ఒక్క రూపాయి జీతం తీసుకుని ప్రజలకు సేవ చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సోనియాను మోసం చేసిన చీటర్ కేసీఆర్ అని విమర్శించారు. మదన్ మోహన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు వేల మంది కాంగ్రెస్‌లో చేరారు. లింగాగౌడ్, ఇర్షాదొద్దీన్, సంకరి రాజలింగం పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన సురేందర్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రజల గౌరవాన్ని ఎమ్మెల్యే సురేందర్ సీఎం కేసీఆర్ పాదాల వద్ద తాకట్టు పెట్టారని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌లో చేరి ఎల్లారెడ్డికి తొలిసారిగా విచ్చేసిన రవీందర్‌రెడ్డికి ఆ పార్టీ కార్యకర్తలు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్, ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో రవీందర్‌రెడ్డి అనుచరులు మాజీ జెడ్పీటీసీ సామెల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాగిరెడ్డిపేట బీఆర్‌ఎస్ నాయకులు విఠల్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డి ప్రజలు చందాలు వేసుకుని సురేందర్‌ను గెలిపిస్తే ప్రజల గౌరవాన్ని సీఎం వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. మదన్‌మోహన్ మాట్లాడుతు బీఆర్‌ఎస్ పాలనలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సురేందర్‌కు మాత్రమే ఉద్యోగం లభించిందన్నారు. నియోజకవర్గంలోని యువకులకు తాను జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలను ఇప్పించానని గుర్తు చేశారు.

అభ్యర్థుల ఖర్చులను పరిశీలించాలి


ఎల్లారెడ్డిలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతున్న శివమూర్తి

ఎల్లారెడ్డి : ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు సంబందించిన ఖర్చు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు పర శివమూర్తి అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో రిటర్నింగ్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వీఎస్‌టీ బృందాలు ఎప్పటికప్పుడు అభ్యర్థులు నిర్వహిస్తున్న సమావేశాలు, సభల వివరాల ఖర్చులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సురేష్ తదితరులున్నారు.

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు గుల్‌దస్తా, అచ్చంపేట గెస్ట్ హౌస్‌ను శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు పర శివమూర్తి సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్ పోస్టుల వద్ద పట్టుబడుతున్న నగదు, మద్యం వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల అధికారులు భిక్షపతి, అంజయ్య ఉన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు నరేష్ శనివారం ప్రారంభించారు. నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, కుంట లింగారెడ్డి, బీంరెడ్డి, ప్రకాష్‌గౌడ్, సత్యం బాలయ్య, నర్సింలు, కార్తీక్, బాబు పాల్గొన్నారు.

కులాల అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం



బీబీపేట : అన్ని కులాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల స్వర్ణకార సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించుకుంటామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని బీఆర్‌ఎస్ సభ్యులకు అందజేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, నీల స్వామి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంసాగర్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచార జోరు, నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులతో జిల్లాల సరిహద్దు చెక్ పోస్టు కేంద్రాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు చేపడతున్నారు. జుక్కల్ మండలంలోని సోపూర్ వద్ద ఏర్పాటు చేసిన కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టు, మద్నూర్ మండలం సలాబత్‌పూర్ మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా సమీపంలో నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోదాలు చేస్తున్నారు. సదరు చెక్‌పోస్టు వద్ద వారం నుంచి డబ్బులు పట్టుబడుతుండటంతో సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల ఎస్పీలు రూపేశ్, సింధుశర్మ పరిశీలించారు.

నియామకం

కామారెడ్డి అర్బన్ : ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ముదిరాజ్ మహాసభ తాత్కాలిక జిల్లా కమిటీని నియమించినట్టు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ముదిరాజ్‌లను ఏకతాటిపైకి తీసుకురావడానికి రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు రాజేశ్వర్ వివరించారు. ముదిరాజ్ మహాసభ కన్వీనర్‌గా గజ్జెల భిక్షపతి, కో-కన్వీనర్లుగా కుడుముల సత్యం, లింగాల కృష్ణమూర్తి, నంద రమేష్, కాళ్ల గణేష్, లింగం, కాదరి రమేష్, పి రమేష్, సాదుల సత్యనారాయణ, సాయిలు, కొప్పుల శ్రీనివాస్, పిట్ల శ్రీనివాస్, అంబటి నారాయణ, దుబ్బాక ప్రసాద్, బీబీపేట సిద్ధిరాములును నియమించినట్లు తెలిపారు.

పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలి



నిజాంసాగర్ : పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు దృష్టి సారించాలని బాన్సువాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారుల బరువులు, ఎత్తు కొలతలు తీశారు. చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం అందజే శారు. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఉన్నారు.

ఇంటింటి ప్రచారం..

భిక్కనూరులో బీఆర్‌ఎస్..




భిక్కనూరు : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

దోమకొండలో..



దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, కుంచాల శేఖర్ ఉన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



లింగంపేట : తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దివిటి రమేశ్ అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో..



సదాశివనగర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి అయిన సురేందర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, పెసరి సాయిలు, కుమ్మరి రాజయ్య పాల్గొన్నారు.

రాజంపేట మండలంలో..

రాజంపేట: రాజంపేటలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలని కోరారు. నల్లవెల్లి అశోక్, సాయిబాబా, చింతల స్వామి, నాగరాజు, గుర్రాల రవి, దుబ్బుని శ్రీకాంత్ పాల్గొన్నారు.

గర్గుల్‌లో..



కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సర్పంచ్ రవి తేజగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్, ఆజామాబాద్, వెల్లుట్ల గ్రామాల్లో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి జాజాల సురేందర్‌ను గెలిపించాలని కోరారు.

ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి..



తాడ్వాయి : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థి శంభుగల్ల లక్ష్మయ్య ప్రచారం చేశారు. ధర్మసమాజ్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం, ఉపాధి కల్పిస్తుందన్నారు.

కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యం



పెద్దకొడప్‌గల్ : తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించడమే కాంగ్రెస్ లక్ష్యమని ఏఐసీసీ అసెంబ్లీ పరిశీలకుడు అన్బు వి వీరమణి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలనకు చరమ గీతం పాడలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గంలో గట్టి పోటిని ఇచ్చే, అందరూ మెచ్చే నాయకుడిని ప్రకటిస్తామన్నారు. మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, మోహన్, విఠల్, బసవరాజ్ దేశాయ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న తండావాసులు

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం శాబ్దిపూర్ లెఫ్టితండాలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం తండావాసులు ఖాళీబిందెలతో పంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. వారం రోజులుగా తండాకు మంచి నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి, సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని పేర్కొన్నారు. నీటి వనరులు గ్రామంలో ఉన్నప్పటికీ వాటర్‌మన్ నిర్లక్ష్యం మూలంగా తండాకు నీళ్లు రావడం లేదన్నారు.

బాన్సువాడలో బీజేపీ జెండా ఎగరేస్తాం

- బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

బాన్సువాడ : ఎన్నికల్లో బాన్సువాడలో బీజేపీ జెండా ఎగరవేస్తామని బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం బాన్సువాడ నియోజకవర్గంలోని మోస్రా, చందూర్, వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, బీర్కూర్, బాన్సువాడలో భారీ కార్లు, బైక్ ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ గతంలో స్పీకర్ చేసిన ఏ ఒక్కరు గెలుపొందలేదని, ఆ సెంటిమెంట్ బీజేపీకి కలిసి వస్తొందన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. బాన్సువాడలో ప్రజలు తనను ఆశీర్వాదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కొత్తకొండ భాస్కర్, గుడుగుట్ల శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి, రాజాసింగ్, అశ్విన్, సాయిబాబా ఉన్నారు.

దళితుల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం : రాష్ట్రంలో ఆర్థికంగా వెనకబడిన దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయా గ్రామాలకు చెందిన దళితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలను దళితబంధు పథకం కింద అందిస్తున్నట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీలు దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని విమర్శించారు. ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, నియోజకవర్గంలోని ఎస్సీ వర్గానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే


కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పెద్దకొడప్‌గల్: తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు. మండలంలోని చిన్న దేవిసింగ్ తండా, టికారం తండా, బురుగుపల్లి, సముందర్ తండా, చావుని తండా, తలాబ్ తండా, శివాపూర్, అంజని, పెద్దకొడప్‌గల్ గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు. ఇతర జిల్లాల నుంచి వచ్చి పోటీ చేస్తున్న నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే రూ.400లకే సిలిండర్ అందిస్తామన్నారు. పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్ దేశాయ్, ఖండేరావు, హన్మంత్ రెడ్డి, సతీష్‌యాదవ్, జాఫర్‌షా పాల్గొన్నారు.

దొరల గడీలు బద్దలు కొట్టాలి

- బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి



కామారెడ్డి టౌన్ : బీసీలు ఐక్యతతో దొరల గడీలు బద్దలు కొట్టాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం పట్టణంలోని 25వార్డు, రాజంపేట మండలానికి చెందిన ఆయా పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో శనివారం మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన యువకులు చింటు, హరిబాబు, సురేష్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులున్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన రాజారెడ్డి పాడిన 'సిన్నదొర సీటు మీద కన్నేసిండే' అనే పాట సీడీని శనివారం పీసీ సీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కామారెడ్డి పట్టణాధ్యక్షుడు రాజు, కారంగుల అశోక్‌రెడ్డి, చందు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాటల సీడీ..



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ బీఆర్‌ఎస్ గెలుపొందాలని పాటలను రాశాడు. ఆ పాటల సీడీని శనివారం ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్ రెడ్డి, మట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.